సింగిల్ విండోలకు త్రీమెన్ కమిటీలు

కలికిరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు సొసైటీలకు ముగ్గురితో కూడిన పాలకవర్గాలను ప్రభుత్వం నియమించింది. జిల్లాలో జనవరి 30వ తేదీ వరకు పద వీకాలంతో పెనగలూరు సొసైటీకి చైర్‌పర్సన్‌గా గబ్బూరి శ్రీదేవి, డైరెక్టర్లుగా ఇండ్ల గంగయ్య, కత్తి సుబ్బరాయుడు, దేవపట్లకు చైర్మన్‌గా మల్లారి కోటేశ్వరరెడ్డి, డైరెక్ట ర్లుగా గురిగింజకుంట కృష్ణంనాయుడు, రాళ్లపల్లె వేణుగోపాల్ నాయుడు, గొర్లముది వీడుకు చైర్మన్‌గా పోలు రంగారెడ్డి, డైరెక్టర్లుగా షేక్ జిలానీబాషా, బండపల్లి బసవ య్యలను నియమించారు. ఈ మేరకు వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు.

నేడు హర్ ఘర్ తిరంగా ర్యాలీ

● హాజరు కానున్న మంత్రి, కలెక్టర్

రాయచోటిటౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ఎన్ కాలనీ లో గల శివాలయం చెక్‌పోస్టు నుంచి సోమవారం ఉదయం 9 గంట లకు చేపట్టనున్న హర్ ఘర్ తిరంగా అవగాహన ర్యాలీని విజయ వంతం చేయాలని రాయచోటి మండల అభివృద్ధి అధికారి సురేశ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్‌లు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. కావున రాయచోటి మండల పరిధిలోని మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి ప్రత్యేక అధికారులు, వెలుగు సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, వెలుగు సిబ్బంది, సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా ర్యాలీ కార్యక్రమా నికి హాజరై విజయవంతం చేయాలని సూచించారు.

బయటపడిన 'విజయనగర' శిలాశాసనం



కొత్తబండివాండ్లపల్లెకు సమీపంలో బయటపడిన శిలాశాసనం

గాలివీడు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూలి వీడు గ్రామం కొత్తబండి వాండ్లపల్లె సమీపంలోని శివాలయం వద్ద శిలాశా సనం బయటపడింది. రిటైర్డ్ ప్రధానోపాధ్యా యుడు వేణుగోపాల్‌రెడ్డి దానిని పరిశీలించి పల మనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిస్టరీ లెక్చ రర్ మలసాని ఆంజనే యరెడ్డికి తెలియచేయగా ఆయన పరిశీలించి వివరాలను మైసూర్‌లోని పురావస్తు శాఖ డైరెక్టర్ మునిర త్నంరెడ్డికి పంపారు. ఈ శాసనం విజయనగర చక్రవర్తుల కాలం నాటిదని, త్వరలో పురావస్తు శాఖాధికారులను సంప్రదించి పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఆయన తెలిపారని వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన రెడ్డెమ్మకొండ



అమ్మవారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆల యంలో ఆదివారం భక్తులతో కిటకిట లాడింది. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఉద యాన్నే ఆలయంలో అమ్మవారికి అర్చన, అభిషేకాలను నిర్వహించారు. అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలు చేశారు. సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆకు పసురును తాగి ఆలయంలో వరప డ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చు కోవడానికి ఆలయానికి రావడంతో పరి సరాలు భక్తులతో రద్దీగా మారాయి. శ్రావణ మాసం మూడో ఆదివారం కావడంతో అమ్మవారిని అధిక సంఖ్యలో మహిళలు దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి విజయాలు వివరిస్తూ..

● వైసీపీ పాపాలు ఎండగడుతూ..
● ఒంటిమిట్టలో మంత్రుల ముమ్మర ప్రచారం
● వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరిక
● ఒంటిమిట్ట చెరువుకు సాగునీటిపై మంత్రి మండిపల్లి హామీ
● ఒంటిమిట్ట జడ్పీటీసీ అభ్యర్థి గెలుపుపై టీడీపీలో ధీమా



ఒంటిమిట్టలో ప్రచారం చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు



ఒంటిమిట్టలో ప్రచారం చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజకవ ర్గంలోని ఒంటిమిట్ట మండలంలో ఈనెల 12న జర గనున్న జడ్పీటీసీ స్థానం ఉపఎన్నికలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సూపర్‌సిక్స్ పథకాలతో పాటు చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు వివ రిస్తూ.. అదే సమయంలో గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో జరిగిన పాపాలను ఎండగడుతూ టీడీపీ నాయకులు ముమ్మరంగా ప్రచారం చేశారు. రాష్ట్ర మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఎన్ ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనంద్‌బాబు, రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజుతో పాటు పలువురు నాయకులు ఒంటిమిట్ట మండలంలో అన్ని గ్రామా ల్లోనూ ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఒకటిన్నర సంవత్సరం కూటమి ప్రభుత్వం ఎన్ని కల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న విధానం, రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల గురించి ఓటర్లకు వివరించారు. ప్రతి నెలా ఒకటో తేదీ, అంతకు ముందే అందుతున్న పెన్షన్లు ఓటర్లకు గుర్తు చేశారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఈనెల 15 నుంచి మొదలు కానున్న స్త్రీశక్తి (ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం) వంటి వాటి గురించి వివరించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతను సీరియస్‌గా తీసు కుని పలువురు వైసీపీ నాయకులను టీడీపీలోకి చేర్పించారు. ఎంపీపీ అక్కిశెట్టి లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ బోగా గీతాదేవి, మండల వైసీపీ మాజీ కన్వీనర్ గజ్జల శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గజ్జల నరసింహారెడ్డితో పాటు వందమందికి పైగా టీడీపీలో చేరారు. మండలంలోని పెన్నపేరూరు, మలకాటుపల్లెకు చెందిన వైసీపీ సీనియర్ నాయ కులు సుబ్బారెడ్డి, వెంకటశేషారెడ్డి, గంగిరెడ్డి, వెంక టసుబ్బారెడ్డిలు మంత్రి మండిపల్లి సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. నరవకాటపల్లె పంచా యతీకి చెందిన వైసీపీకి చెందిన దాదాపు 70 కుటుంబాలు టీడీపీలో చేరాయి. మంత్రి రాంప్రసా ద్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో వీళ్లు టీడీపీలో చేరారు.

సమస్యలను పరిష్కరిస్తూ...

జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా గ్రామాల్లో పలు వురు ప్రజలు తమ సమస్యలను మంత్రుల దృష్టికి తెచ్చారు. అప్పటికప్పుడే పరిష్కారం అయ్యే సమస్య అయితే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్క రించే సమస్య అయితే ఉప ఎన్నిక ముగిసిన తర్వాత వెంటనే ఆ సమస్యను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీలు ఇచ్చారు. ఇలా ఇచ్చిన హామీల్లో ముఖ్యమైనది ఒంటిమిట్ట చెరువుకు సాగు నీరు ఇవ్వడం. సాధార ణంగా భద్రాద్రి తర్వాత అంతటి ప్రాముఖ్యమైన ఒంటిమిట్ట కోదండ రామా లయం గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిం దనే ఆరోపణలు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒంటి మిట్ట రామాలయం అభి వృద్ధి చేస్తున్నట్లు కూటమి నాయకులు పేర్కొంటు న్నారు. ఒంటిమిట్ట చెరు వుకు సాగునీరు ఇస్తే శ్రీరా మాలయంలో ఏటా జరిగే కల్యాణోత్సవానికి నీటి సమస్య ఉండదని స్థాని కులు మంత్రి మండిపల్లి దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన వెంటనే రాష్ట్ర నీటి పారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుతో మాట్లాడారు. రూ.8 కోట్ల నిధులు అవసరం అవుతాయని, ఎన్నిక అయిపోయిన తర్వాత ఒంటిమిట్టకు సాగునీటి సమస్య పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

మండలంలోని పెన్నపేరూరు, గంగపే రూరు ప్రాంతాలలో సోమశిల బ్యాక్‌వాటర్ వల్ల పొలాలు నీటమునుగుతాయని, నీట మునిగిన పొలాలకు గత ప్రభుత్వం పరిహారం చెల్లించి నివా సాలకు చెల్లించలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు మంత్రి దృష్టికి తెచ్చారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇళ్లకు కూడా పరిహారం ఇస్తామని ఆ గ్రామాల ప్రజ లకు హామీ ఇచ్చారు. కొత్తమాధవరం గ్రామంలోని భావ నారాయణ స్వామి ఆలయం వద్ద పలువురు స్థలాలు ఆక్ర మించారని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యా దుపై స్పందించిన మంత్రి రెవెన్యూ అధి కారులతో మాట్లాడారు. ఆక్రమణకు గురైన స్థలాలు స్వాధీనపర్చుకోవాలని ఆదేశించారు.

టీడీపీలో గెలుపుపై ధీమా

రాష్ట్ర ప్రభుత్వం పట్ల సానుకూల వైఖ రితో ప్రజలు ఉన్నారని, అందులో భాగం గానే.. ఉప ఎన్నిక ప్రచారంలో మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. పలువురు వైసీపీ ముఖ్యనాయకులు టీడీపీలో చేరారు. దీంతో ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానం గెలుపుపై తెలుగుదేశం పార్టీలో ధీమా కని పిస్తోంది. వైసీపీకి చెందిన సిట్టింగ్ స్థానంలో పసుపు జెండాను ఎగురేస్తామని ఉత్సాహంగా ఉన్నారు.



ఒంటిమిట్టలో కూరగాయల అంగడి వద్ద ప్రచారం చేస్తున్న మంత్రి ఫరూక్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీశ్

ష్...గప్‌చుప్

● ప్రచారం పరిసమాప్తం
● పులివెందులలో ఓటు రేటు రూ.5వేలు
● ఒంటిమిట్టలో రూ.3 వేలు

(కడప - ఆంధ్రజ్యోతి): జిల్లాలో మినీ సంగ్రా మాన్ని తలపించే విధంగా జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల ప్రచారం ఆది వారం సాయంత్రం 5 గంటలకు పరిసమాప్త మైంది. ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ నుంచి కూటమికి సంబంధించి మంత్రులు సవిత, రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్ధనరెడ్డి, ఫరూక్, విశ్వ రూప్, ఎమ్మెల్యేలు విస్తృతంగా ప్రచారం చేశారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ జరగనుంది. ఎన్ని కలు ప్రశాంతంగా నిర్వహించేందుకు 1400 మంది పోలీసులను నియమించారు. డీఐజీ కోయ ప్రవీణ్ ఆధ్వర్యంలో కడప ఎస్పీ అశోక్‌కుమార్ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నారు.

పులివెందులలో రూ.5వేలు... ఒంటిమిట్టలో రూ.3 వేలు

జడ్పీటీసీ ఉప ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మ కంగా తీసుకున్న పార్టీలు అదేస్థాయిలో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నాయి. పులివెందులలో గెలుపును వైసీపీ చాలా ప్రతిష్టాత్మకంగా తీసు కుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఓటుకు రూ.5 వేలు పంపిణీ చేసినట్లు చెబుతు న్నారు. టీడీపీ కూడా అదే స్థాయిలో ఓటుకు నోటు ఇచ్చినట్లు చెబుతున్నారు. అంటే ఒక్కో ఓటుకు ఇరుపార్టీలు కలిసి రూ.10 వేలు ఇస్తు న్నారు. ఆదివారం రాత్రికే మొత్తం పంపిణీ పూర్త యినట్లు చెబుతున్నారు. ఒంటిమిట్టలో రూ.3 వేలు వంతున పంపిణీ చేసినట్లు చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లో వైసీపీ రూ.4 వేలు కూడా ఇచ్చి నట్లు చెబుతున్నారు. మొత్తానికి అయితే పులివెం దుల, ఒంటిమిట్టలో సుమారు రూ.25 కోట్లకు పైగా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసినట్లు చర్చ జరుగుతోంది.

ఒంటిమిట్ట చెరువుకు త్వరలో సాగునీరు

● మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ఒంటిమిట్ట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట చెరువుకు త్వరలో సాగునీరు అందించి రైతాంగాన్ని ఆదుకుంటామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఒంటిమిట్టలోని కల్లావీధి ప్రజలతో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబునాయుడు ఒంటిమిట్ట చెరువుకు సాగునీరు కొరకు రూ.35 కోట్లతో శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారన్నారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని నిర్వీర్యం చేసిందన్నారు. మళ్లీ చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రి అయ్యారని, త్వరలోనే చెరువుకు సాగునీరు అందిస్తా మన్నారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రితో కూడా చర్చించానన్నారు. ఒంటిమిట్ట జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి గెలుపు ఒంటిమిట్ట అభివృద్ధికి నాంది అన్నారు

గండికోటలో పెరుగుతున్న నీటిమట్టం

● ఇన్‌ఫ్లో 16,220 క్యూసెక్కులు

కొండాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో రోజురోజుకు నీటిమట్టం వేగంగా పెరుగుతూ వస్తోంది. ప్రాజెక్టులోకి ఆదివారం వచ్చే ఇన్‌ఫ్లో 16,220 క్యూసెక్కులు ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో శనివారం రాత్రి నుంచి కురిసిన వర్షం వల్ల వాగులు, వంకల ద్వారా గండికోట ప్రాజెక్టులోకి 3720 క్యూసెక్కుల వర్షపునీరు వచ్చి చేరినట్లు ఈఈ తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 12,500 క్యూసెక్కులు ఉందన్నారు. గండికోట ప్రాజెక్టులో ప్రస్తుతం 17.224 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలని ఈఈ తెలిపారు.



గండికోట ప్రాజెక్టులోకి వేగంగా చేరుతున్న నీరు

కడప-బద్వేల్ మధ్య రాకపోకలు ప్రారంభం

● మంత్రి ఆదేశాలతో తాత్కాలిక రోడ్డు



కల్వర్టు పక్కన తాత్కాలిక రోడ్డుపై వెళుతున్న వాహనాలు

సిద్దవటం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని కడప-బద్వేలు రహదారిలోని సాహెబ్ బావి సమీప ప్రాంతంలో కూలిపో యిన కల్వర్టు ప్రాంతంలో తాత్కాలిక రోడ్డు వేయడంతో వాహనాల రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఆర్‌అండ్‌బీ డీఈ షేక్ షావలి ఆదివారం సిద్దవటంలో మాట్లా డుతూ కూలిన కల్వర్టు పక్కన తాత్కాలికంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి వాహనాల రాక పోకలు పునరుద్ధరించామన్నారు. ప్రయాణికు లకు ఇబ్బంది లేకుండా పనులు చేయాలని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేయడంతో వెంటనే తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలు ప్రారంభించా మని తెలిపారు. కూలిపో యిన కల్వర్టు నిర్మాణం పనులు త్వరలో చేపడతా మన్నారు. కార్యక్రమంలో ఈఈ నాగేశ్వర్‌రెడ్డి, ఏఈ రామాంజనేయులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీరాములు, బద్వేల్ ఆర్టీసీ డిపో సిబ్బంది పాల్గొన్నారు.

ఉప ఎన్నికలకు సర్వం సిద్ధం

● 12న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
● 14న మౌలానా ఉర్దూ యూనివర్సిటీలో కౌంటింగ్
● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న కడప కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్

కడప కలెక్టరేట్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్ని కల ప్రక్రియకు సంబంధించి ఈనెల 12న పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఆదివారం కడప కలెక్టరేట్‌లో ఎస్పీ అశోక్‌కుమార్, జడ్పీ సీఈవో ఓబులమ్మతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 12న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, బ్యాలెట్ బాక్సుల ద్వారా పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుంద న్నారు. ఆదివారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగిసిందని, అభ్యర్థులు, పార్టీల ప్రతినిధులు, ఎటువంటి ప్రచారం చేయకూడదని తెలిపారు. స్థానికేతరులు పోలింగ్ ప్రక్రియ ముగిసేంత వరకు తమ ప్రాంతాలకు వెళ్లి పోవాలన్నారు. లేనిపక్షంలో ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. పులివెందులలో 95 శాతం, ఒంటిమిట్టలో 96 శాతం మేర ఓటరు స్లిప్పులు పంపిణీ చేశా మని, మిగిలిన వారందరికీ కూడా ఓటరు స్లిప్పులు అందజేస్తామని తెలి పారు. పులివెందులలో 15, పోలింగ్ కేంద్రాలు, ఒంటిమి ట్టలో 10 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. సీసీ కెమెరాలు, వెబ్‌క్యాస్టింగ్ ఉంటుందని, లేనిచోట్ల మైక్రో అబ్జర్వర్లను నియమించామని తెలిపారు. కాగా 14న కడప నగ రంలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీలో కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎస్పీ అశోక్‌కు మార్ మాట్లాడుతూ జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పులివెందుల, ఒంటిమిట్ట పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని, అవాం ఛనీయ సంఘటనలకు తావులేదన్నారు. జిల్లాలో మొత్తం 13 చెక్‌పోస్టుల వద్ద కట్టుది ట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

ఏపీలో బీజేపీ ఓ శక్తిగా ఎదగాలి

● కూటమి ప్రభుత్వంతో కలిసి హంద్రీ-నీవా పూర్తి చేస్తాం
● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మాజీ సీఎం నల్లారి కిరణ్



కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మాధవ్, నల్లారి కిరణ్, సాయిలోకేశ్ తదితరులు

రాయచోటి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీలో బీజేపీ ఓ శక్తిగా ఎదగాలని, రాష్ట్రంలో బీజేపీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఆదివారం రాయచోటిలోని బంగ్లా నుంచి సాయిశుభ కల్యాణ మండపం వరకు బీజేపీ నాయకులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర అధ్యక్షుడితో పాటు మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలకు చీనీకాయల గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం సాయిశుభ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నల్లారి కిరణ్ మాట్లాడుతూ ఏపీలో భారతీయ జనతా పార్టీని కార్యకర్తలు ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. హంద్రీ-నీవా ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. బీజేపీ ముస్లింలకు వ్యతిరేకం కాదని, కొందరు అలా సృష్టిస్తున్నారన్నారు. జిల్లాలో టీడీపీ, జనసేనలతో కలిసి అభివృద్ధికి ప్రయత్నం చేయాలని తెలిపారు. అనంతరం మేధావుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జకియాఖానం ఇంట్లో తేనీటి విందులో పాల్గొన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, నాయకులు నరసింహారెడ్డి, రమేశ్‌నాయుడు, సుబ్బారెడ్డి, బండి ఆనంద్, పనతల సురేశ్, ఆంజనేయప్రసాద్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన పవన్‌కుమార్

మైదుకూరు రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రక్షాబంధన్ సందర్భంగా ఫ్రెండ్ చెల్లెలితో రాఖీ కట్టించుకోవాలని వెళ్లాడు.. తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మైదుకూరు మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. యర్రగుంట్ల టౌన్‌లో నివసిస్తున్న దేరంగుల పవన్‌కుమార్ (23) వైరింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడని, శనివారం రక్షాబంధన్ అయినందున తన ఫ్రెండ్ నాగరాజు నాయక్ చెల్లెలితో రాఖీ కట్టించుకొనేందుకు స్నేహితులిద్దరూ బైక్‌పై బద్వేల్‌కు వెళ్లారన్నారు. అక్కడ ఆమెతో రాఖీ కట్టించుకొని తిరిగి వస్తుండగా మండలంలోని బసవాపురం సమీపంలో రాత్రి సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రగాయాలతో ఉన్న ఇరువురిని స్థానికులు 108 వాహనంలో మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే పవన్‌కుమార్ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని, నాగరాజు నాయక్‌ను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని, ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సుబ్బయ్య తెలిపారు.

ట్రాక్టరుకింద పడి యువకుడి మృతి


మృతి చెందిన సుదర్శన్ ఫైల్‌ఫొటో

కడప క్రైం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కడప నగరం బిల్డప్ సర్కిల్ వద్ద ప్రమాదవశాత్తు యువకుడు ట్రాక్టరుకింద పడి మృతి చెందినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఆ వివరాల మేరకు.. చెన్నూరు మండలం కొక్కిరాయపల్లె గ్రామానికి చెందిన దొరబోయిన సుదర్శన్ (21) ఐటీఐ చదువుకుంటున్నాడు. అన్న కడప కార్పొరేషన్‌కు సంబంధించి చెత్త సేకరించేందుకు ట్రాక్టరును బాడుగకు ఇచ్చాడు. అయితే ఆదివారం కావడంతో సుదర్శన్ కూడా ఖాళీగా ఉండలేక ట్రాక్టరుతో పాటు వచ్చాడని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వినాయక్‌నగర్ సమీపంలోకి రాగానే గేదె అడ్డురావడంతో ట్రాక్టర్‌కు సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో ట్రాక్టరులో ఉన్న సుదర్శన్ పట్టు తప్పి అదే ట్రాక్టరు కింద పడిపోవడంతో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి...

కమలాపురం రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోపులాపురం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున రైలుకింద పడి కామనూరు నాగరాజు (35) మృతి చెందినట్లు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. కమలాపురం మండలం సి.రాజుపాలెం గ్రామానికి చెందిన నాగరాజు పశువులు మేపుతూ జీవనం సాగించేవాడు. మూడు సంవత్సరాల క్రితం తన భార్య టీబీ జబ్బు వల్ల చనిపోయింది. శనివారం పశువులు మేతకు వెళ్లి కనిపించలేదని, పాచికలపాడు సమీపంలో ఉన్నట్లు తెలుసుకుని వాటిని తోలుకుని వచ్చేందుకు నాగరాజు వెళ్లాడన్నారు. అయితే ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ గోపులాపురం సమీపంలో రైలు పట్టాలపై శవంగా కనిపించాడని రోదించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె కలరు. చిన్నారుల తల్లిదండ్రులిద్దరూ చనిపోవడంతో అనాథలుగా మిగిలారని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

యువకుడికి గాయాలు

మైదుకూరు రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): చాపాడు మండలం సిద్దారెడ్డిపల్లెకు చెందిన యువకుడు జి.నాగభూషణం తన తల్లితో కలిసి మోటర్‌సైకిల్‌పై వస్తూ ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొనడంతో గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఆదివారం వ్యక్తిగత పని మీద మైదుకూరుకు వచ్చి తిరిగి సిద్దారెడ్డిపల్లెకు వెళ్తుండగా ప్రొద్దుటూరులోని పశువైద్యశాల వద్ద ఆగి ఉన్న ఇన్నోవా వాహనాన్ని ఢీకొట్టారు. గాయపడినవారిని స్థానికులు 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విషద్రావణం తాగి మహిళ ఆత్మహత్యా యత్నం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో కలత చెంది మహిళ విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం మదనపల్లె పట్టణంలో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం అనపగుట్టకు చెందిన సంధ్య(35) టైలర్‌గా, తన భర్త శ్రీనివాసులు ఎలక్ట్రీషన్‌గా పని చేస్తూ జీవనం సాగించేవారని, శనివారం రాత్రి ఇరువురు ఘర్షణ పడ్డారని తెలిపారు. దీంతో మనస్థాపం చెందిన సంధ్య ఆదివారం ఉదయం విషద్రావణం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

పోరుమామిళ్ల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల చిన్నారిపై జరిగిన అత్యాచారం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన కలసపాడు మండలంలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడిని ఆదివారం పోరుమామిళ్ల మండలం మార్కాపురం వద్ద అరెస్టు చేసి కోర్టుకు పంపుతున్నట్లు తెలిపారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి సంఘటనలు జరగడం అత్యంత బాధాకరమన్నారు. తల్లిదండ్రులు చిన్న పిల్లలకు సెల్‌ఫోన్లు దూరంగా ఉంచాలని, సెల్‌ఫోన్లలో వచ్చే అశ్లీల సన్నివేశాలకు చాలామంది ప్రభావితులై ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు. సమావేశంలో ఎస్ఐలు కొండారెడ్డి, తిమోతి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ : ఆస్తి నష్టం

వల్లూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుల్లారెడ్డిపేటలో శనివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగింది. ఈ ప్రమాదంలో రూ.50వేల విలువ చేసే ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయినట్లు యజమాని నాగేంద్ర తెలిపారు. బాధితుడి వివరాల మేరకు.. శనివారం రాత్రి ఇంటి ఆవరణంలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో శబ్ధాలు రావడంతో ఇంటి తలుపులు తీశామని, విద్యుత్ షార్టుసర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న ఫ్రిజ్, ఫ్యాను తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయని వాపోయారు. అలాగే ఇంటి పైకప్పు, ఇళ్లంతా నెర్రలు బారాయని, మంట లు వ్యాపించడం వల్ల నలుపు ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


కాలిపోయిన ఫ్రిడ్జ్

బిల్లులు లేకుండా ఎరువులు అమ్మితే చర్యలు

ములకలచెరువు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బిల్లులు లేకుండా ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో స్రవంతి హెచ్చరించారు. మండంలోని వేపూరికోటలో ఆదివారం జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు తప్పనిసరిగా జీఎస్టీ బిల్లు ఇవ్వాలన్నారు. ప్రతి దుకాణం ముందు తప్పనిసరిగా స్టాక్‌బోర్డు ఇవ్వాలన్నారు. కాలం చెల్లిన మందులు, విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

14న పులివెందుల ప్రజలకు స్వాతంత్య్రం

స్వేచ్ఛాయుత వాతావరణంలో పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక : బీటెక్ రవి



పులివెందుల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక ఫలితాలు ఈనెల 14వ తేదీ వెలువడతాయని, దీంతో ఇండిపెండెన్స్‌డేకు ఒకరోజు ముందే పులివెందుల ప్రజలకు స్వాతంత్య్రం సిద్ధిస్తుందని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) అన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. పులివెందుల నియోజకవర్గంలో ఏడు మండలాలకు గాను పులివెందుల మండలానికి సంబంధించి జడ్పీటీసీ ఉప ఎన్నిక జరుగుతోందన్నారు. ఇది చాలా చిన్న ఎన్నిక అని, గెలుపుపై తమ పార్టీ పూర్తిగా దృష్టి సారించిందన్నారు. ఇందుకోసం ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లామన్నారు. ప్రచారానికి వెళ్లిన సమయంలో పులివెందుల ప్రజలు ఈ ఎన్నికలు గౌరవాన్ని తెచ్చిపెట్టాయని అంటున్నారన్నారు. గతంలో ఆయా పంచాయతీల్లోని ఒకరిద్దరు నాయకులు వెళ్లి వైఎస్ కుటుంబం వద్ద మెప్పుపొందేవారని, కానీ ఈ ఎన్నికలు రావడంతో గతంలో మాదిరి కాకుండా ప్రతి ఒక్కరి అభిప్రాయాలను గుర్తిస్తామని చెబుతున్నారన్నారు. ముఖ్యంగా వైసీపీ సాక్షి విలేకరులను, వాహనాలను తిప్పుతున్నారని, రాష్ట్రంలో ఉన్న వాహనాలన్నీ పులివెందులలోని గ్రామగ్రామానికి తెచ్చారన్నారు. గ్రామాల్లో వారంతట వారే అలజడి సృష్టించి లేనిపోని విధ్వంసాలకు దిగుతారని అనుమానంగా ఉందని, ఈ నేపథ్యంలో పోలీసులు కూడా పూర్తిస్థాయిలో భద్రత ఏర్పాటు చేస్తున్నారని, పులివెందులలో జరగబోయే జడ్పీటీసీ ఉపఎన్నికలు పూర్తిగా స్వేచ్ఛాయుత వాతావరణంలో సాగుతాయని బీటెక్ రవి తెలిపారు.

పులివెందుల ఎవరి అడ్డా కాదు..: ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



పులివెందుల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పులివెందుల ఎవరి అడ్డా కాదని, ఎవరి కంచుకోట కాదని, ఇందిరాగాంధీ లాంటి మహా నాయకురాలినే ఓడించిన ఘనత ఈ ప్రజలకు ఉందన్నారు. అటువంటి ఓటర్లకు ఎవరిని గెలిపించాలో బాగా తెలుసునని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. పులివెందుల ప్రాంతంలో జరిగిన అనేక ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేశామని, అందులో భాగంగానే ఇప్పుడు జరగబోయే ఎన్నికల్లో కూడా టీడీపీ బరిలో దిగిందన్నారు. కానీ అప్పటికీ, ఇప్పటికీ చాలా వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. గతంలో దౌర్జన్యాలు, దుర్మార్గాలు, కక్షసాధింపులతో ఎన్నికలు జరిగేవని, కానీ ఈ ఎన్నికలు పూర్తిగా స్వేచ్ఛాయుత వాతావరణంలో సాగబోతున్నాయన్నారు. హత్యా రాజకీయాలను ఈ ప్రాంతంలో వైసీపీ పెంచి పోషించిందన్నారు. పులివెందుల వైఎస్ కుటుంబం అడ్డా అని అనుకోవాల్సిన అవసరం లేదన్నారు. పులివెందులలో జరుగుతున్న జడ్పీటీసీ ఉప ఎన్నికలు నాలుగు దశాబ్దాల తర్వాత స్వేచ్ఛాయుత వాతావరణంలో సాగుతున్నాయన్నారు.

ప్రశాంత ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ ప్రయత్నం : ఎమ్మెల్యే ఆది


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

పులివెందుల రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో 2021లో జడ్పీటీసీ ఎన్నికలు జరిగితే టీడీపీ, బీజేపీ నాయకులు నామినేషన్ వేయకుండా వైసీపీ దౌర్జన్యం చేసిందని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ధ్వజమెత్తారు. అయితే ప్రస్తుతం జడ్పీటీసీ ఎన్నికలకు 11 నామినేషన్లు వచ్చాయని, ఇదే క్రమంలోనే ఎన్నికలు కూడా జరగబోతున్నాయన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గట్టెక్కిస్తున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ సహకారంతో నిధులు తేవడంతో పాటు పరిశ్రమలు వచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఎన్నడూ లేని విధంగా పులివెందులలో ప్రశాంతంగా ఎన్నికలు జరుతున్నాయని, ఈ ప్రశాంతతను చూసి వైసీపీ ఓర్వలేక వారిపై వారే దాడులు చేసుకొని తమపై నిందలు మోపి ఇక్కడ ఏదో జరగబోతోందని ప్రశాంత ఎన్నికలను అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. సొంత చెల్లెళ్లను పట్టించుకోని జగన్ తనను గెలిపించిన పులివెందుల ప్రజలను ఏం పట్టించుకుంటాడని, ప్రజలు ప్రతి విషయాన్ని గుర్తుపెట్టుకుంటారని, గతంలో చేసిన అరాచకాల కారణంగానే ప్రజలు 151 నుంచి 11సీట్లలో కూర్చోబెట్టారన్నారు. ఇక్కడి సమస్యలను, చేయాల్సిన అభివృద్ధి పనులను వంద రోజుల్లోనే పూర్తిచేసేలా సత్వర చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. ప్రజల సహకారం ఉందని, పులివెందులలో తప్పకుండా జెండా పాతుతామన్నారు. కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంసాగర్‌కు 6 టీఎంసీల నీరు


బ్రహ్మంసాగర్ ఎడమ కాల్వ నుండి దిగువకు వెళుతున్న నీరు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్ ప్రాజెక్టుకు 6 టీఎంసీల నీరు వచ్చి చేరిందని ప్రాజెక్టు అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నాగేశ్వర్‌రావు తెలిపారు. వెలుగోడు ప్రాజెక్టు నుంచి ఇన్‌ఫ్లో 1400 క్యూసెక్కులు ప్రాజెక్టులోకి రాగా కుడి, ఎడమ కాలువ, థర్మల్ ప్రాజెక్టుకు 380 క్యూసెక్కులు విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు. పై నుంచి బ్రహ్మంసాగర్‌కు నీరు చేరేలోపల నీటిని రైతన్నలు పొదుపుగా వాడుకోవాలని ఆయన తెలిపారు. కాగా ఎడమ కాల్వకు రైతుల అభ్యర్థన మేరకు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆదేశాలతో శనివారం బ్రహ్మంసాగర్ నుంచి తెలుగుగంగ అధికారులు, టీడీపీ నేతలు నీటిని దిగువకు వదిలారు.

పోలీస్‌స్టేషన్ ముట్టడి

- బాలిక కిడ్నాప్ కేసులో న్యాయం చేయలేదని బాధితుల ఆవేదన

రామసముద్రం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడిని పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం చేశారని ఆరోపిస్తూ బాధిత కుటుంబాల సభ్యులు ఆదివారం పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. ఓ మైనర్ బాలికను బి.కొత్తకోట కు చెందిన యువకుడు గత ఎనిమిదో తేదీ రాత్రి ఇంటి తాళం పగులగొట్టి బాలికను కిడ్నాప్ చేసి బలవంతంగా పెళ్లి చేసుకున్నాడని, అంతేకాకుండా ఇంటిలోని బీరువాలో ఉన్న బంగారు నగలు ఎత్తుకెళ్లాడని బాధితులు అంటున్నారు. ఈ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని, అయితే నిందితుడిని పట్టుకోవడం లో పోలీసులు నిర్లక్ష్యం చూపడంతో తామే నిందితుడిని అచూకీ కనుక్కొని ఆదివారం బాలికతో పాటు నిందితుడిని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఇంటి నుండి ఎత్తుకెళ్లిన బంగారు నగలు, డబ్బు నిందితుడి నుండి రాబట్టి అతనిపై కేసు నమోదు చేయాలని బాధితులు కోరుతున్నారు. ఈ మేరకు నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోప్ స్కిప్పింగ్ జిల్లా జట్టు ఎంపిక

మదనపల్లె టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన రోప్ స్కిప్పింగ్ క్రీడాకారుల నైపుణ్యం పరీక్షించి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు కరుణాకర్, లత, శరత్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి, ఈనెల 30వ తేదీన కర్నూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. అక్కడ గెలుపొందిన జిల్లా జట్టు మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి రోప్‌స్కిప్పింగ్ పోటీలకు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో జ్ఞానాంబిక కళాశాల కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, క్రీడాకారులు పాల్గొన్నారు.


జిల్లా జట్టుకు ఎంపికైన రోప్ స్కిప్పింగ్ క్రీడాకారులు

గొర్రెల కాపరిపై ఎలుగుబంటి దాడి


గాయపడిన నాగరాజు

పోరుమామిళ్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గొర్రెలను మేపుకు నేందుకు కొండపైకి వెళ్లిన కాపరిని పిల్లల తల్లి అయిన ఎలుగుబంటి దాడి చేయడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. పోరుమామిళ్ల మండలంలోని ఎరసాల గ్రామానికి చెందిన బాయకట్టు నాగరాజు ఆదివారం గొర్రెల మేపునకు కొండకు వెళ్లాడు. అక్కడ మేపుతుండగా ఒక్కసారిగా పిల్లల తల్లి ఎలుగుబంటి దాడి చేయడంతో భయంతో ఆ గొర్రెలకాపరి కేకలు వేశాడు. అక్కడే ఉన్న కొందరు గొర్రెల కాపరులు సంఘటనాస్థలానికి చేరడంతో అవి పరారీ అయ్యాయి. నాగరాజు ముఖానికి, చేతులకు పెద్ద గాయాలు కావడంతో పోరుమామిళ్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు.

బంగారు నగల దుకాణంలో చోరీ

- రూ.15లక్షలు విలువ చేసే బంగారు, వెండి నగలు అపహరణ
- నగల బ్యాగుతో ఇద్దరు దొంగలు పరారీ

బద్వేలుటౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బద్వేలు మున్సిపాలిటీలో వరుస చోరీలతో పట్టణ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఆదమరచి ఉన్నామంటే చాలు చుట్టుపక్కల ఎందరు ఉన్నా.. ఎన్ని సీసీ కెమెరాలు వారి వైపే చూస్తున్నా.. దొంగల్లో అసలు బెరుకు అనేదే లేకుండా స్కెచ్‌వేసి, రెక్కీచేసి కొట్టాల్సిన టార్గెట్‌ను కనురెప్పపాటలో కొట్టుకుపోతున్నారు. దీనికి నిదర్శనం బద్వేలులో శనివారం రాత్రి జరిగిన బంగారు దుకాణంలో చోరీ ఘటనే నిదర్శనంగా నిలుస్తోంది. ఆ వివరాల్లోకి వెళితే... పట్టణంలోని సిద్దవటం రోడ్ మసీద్ కాంప్లెక్స్‌లో ఉన్న జేబీ బంగారు దుకాణాన్ని మూతవేస్తూ శనివారం రాత్రి దుకాణంలోని నగలన్నింటినీ ఒక బ్యాగులో పెట్టుకొని ఇంటికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండగా దుకాణ యజమాని ఒక పని నిమిత్తం బయటకు వెళ్లాడు. గమనించిన దొంగ ఆ దుకాణంలోకి దూరి నగల బ్యాగును పట్టుకొని ఉడాయించాడు. పక్కనే ఉన్న దుకాణదారుడు ఆ షాపుయజమానికి ఫోన్ చేయగా వచ్చి చూసేలోపే అంతా జరిగిపోయింది. అందులో 74గ్రాముల బంగారు నగలు, 7 కేజీల వెండి సామగ్రి ఉన్నాయని షాపు యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఆ దొంగకోసం నిఘాపెట్టిన ప్రయోజనం లేకుండా పోయింది. ఆదివారం ఉదయం క్లూస్‌టీం వచ్చి పరిశీలించారు. త్వరలోనే దొంగను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

రాణిస్తున్న మహిళా సబ్‌కలెక్టర్లు


సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్న చల్లా కల్యాణి

మదనపల్లె టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): దేశంలో అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా పేరొందిన మదనపల్లెలో సబ్‌కలెక్టర్లుగా మహిళలు రాణిస్తున్నారు. ఎనిమిదేళ్లలో ఎక్కువగా మహిళా సబ్‌కలెక్టర్లే పాలన సాగించారంటే అతిశయోక్తి కాదు. మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన మహిళల్లో కృతికశుక్లా, వెట్రిసెల్వి, మేఢిద జాహ్నవి, కీర్తి చేకూరి వున్నారు. వీరి తరువాత వైసీపీ పాలనలో మూడేళ్లుగా ఆర్డీవో మురళి, హరిప్రసాద్ పనిచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మేఘస్వరూప్ సబ్‌కలెక్టర్‌గా ఏడాది పనిచేశారు. తాజాగా చల్లా కల్యాణి సబ్‌కలెక్టర్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

అభివృద్ధికి ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధం : మంత్రి


పులివెందుల మండలం నల్లగొండవారిపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి

పులివెందుల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగే అభివృద్ధి, సంక్షేమానికి ఓటు వేసేందుకు పులివెందుల ప్రజలు సిద్ధంగా ఉన్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత అన్నారు. ఆదివారం మండలంలోని రాయలాపురం గ్రామంలో ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలు అందించి పింఛన్లు, తల్లికివందనం పథకాలు అందాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోడ్లు బాగుచేయించాలని ప్రజలు అడుగగా ఈ గ్రామానికి రూ.40లక్షలు మంజూరైందని, ఆ నిధులతో రోడ్లు పూర్తిచేయిస్తామని మంత్రి తెలిపారు. జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని, కూటమి ప్రభుత్వ పాలన పట్ల సంతోషంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం ఉన్నప్పుడు, లేనప్పుడూ వైసీపీ దౌర్జన్యాలు ఆగడం లేదని ప్రజలే అంటున్నారన్నారు.

గ్రామాల్లో ప్రచార హోరు

పులివెందుల మండలంలోని ఇ.కొత్తపల్లె గ్రామంలో మంత్రి పార్థసారధి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నల్లగొండవారిపల్లెలో జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి, అలాగే అచ్చవెల్లి గ్రామంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

హవ్వా.. ఓటుకు రూ.10వేలా..!

- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కూటమి, వైసీపీ
- తులసిరెడ్డి ఆశ్చర్యం

వేంపల్లె, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని వైసీపీ, కూటమి పార్టీలు అపహాస్యం చేస్తున్నాయని, పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రెండు పార్టీలు ప్రయత్నించడం దురదృష్టకరమని, ఓటుకు రూ.10వేలు పలుకుతుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మొన్నటి వరకు వైసీపీ దౌర్జన్యాలకు దిగిందని, నామినేషన్ వేయకుండా అడ్డుకుందని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ వీరవిహారం చేశారన్నారు. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలో ధనస్వామ్యంగా జరుగుతోందన్నారు. 9 నెలల కాలంమాత్రమే ఉన్న ఎలాంటిఅధికారాలు లేని జడ్పీటీసీకి ఇంతలా దిగజారుతారా అంటూ ప్రశ్నించారు. ఎన్నికలు ఎందుకు.. వేలంపాట గాని, లాటరీపద్ధతిలో నిర్వహిస్తే సరిపోతుంది కదా అన్నారు. ఇటు ప్రతిపక్ష వైసీపీ, కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే ఎన్నికల కమిషన్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమని, ఈ పరిణామం ప్రజాస్వామ్యంలో సిగ్గుచేటని తులసిరెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.2.29లక్షల విరాళం


విరాళం అందిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘు నేతలు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కాలజ్ఞాన కర్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మనవరాలు జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ప్రకాశం జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి కుందుర్తి సీతారామాంజనేయులు, కోశాధికారి రాచర్ల రాజశేఖర్, కమిటీ సభ్యులు రూ.2.29లక్షల విరాళాన్ని అందించారు. ఆదివారం వారు ఈశ్వరీదేవి మఠం మఠాధిపతి వీరశివకుమారస్వామికి ఈ నగదును అందించినట్లు మఠం కార్యనిర్వాహణాధికారి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మఠాధిపతి మాట్లాడుతూ విరాళం ఇచ్చిన దాతలకు ఈశ్వరీదేవి మాత దివ్యానుగ్రహం ఎల్లవేళలా ఉండాలని ఆయన ప్రార్థించారు.

ఒంటిమిట్టలో టీడీపీ విజయం ఖాయం

● ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, పారిశ్రామికవేత్త డాక్టర్ జీఎన్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న పత్తిపాటి పుల్లారావు, డాక్టర్ జీఎన్ నాయుడు

రాజంపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీకి భారీ మెజారిటీ ఖాయమని చిలకలూరుపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, టీడీపీ సీనియర్ నాయకుడు, రీజెన్సీ సిరామిక్ పరిశ్రమల అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు తెలిపారు. ఆదివారం ఉదయం పట్టణంలోని డాక్టర్ జీఎన్‌నాయుడు అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఒంటిమిట్టను ఆంధ్ర భద్రాద్రిగా ప్రకటించి ఒంటిమిట్టకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. సోమశిల వెనుక జలాల నుంచి సుమారు రూ.36 కోట్ల ఖర్చుతో ఒంటిమిట్ట చెరువుకు నీరందించే శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని అమలు చేశారన్నారు. ఈ సందర్భంలో వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించి చంద్రబాబునాయుడు రుణం తీర్చుకుంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుడారు సుబ్రమణ్యం నాయుడు, తెలుగు యువత నాయకులు చంద్రబాబునాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతనాయుడు పాల్గొన్నారు.

ముమ్మరంగా మంత్రుల ప్రచారం



ఒంటిమిట్టలో ప్రచారం నిర్వహిస్తున్న రాష్ట్ర మంత్రి ఫరూక్



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సుగుణమ్మ

ఒంటిమిట్ట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్టలో రాష్ట్ర మంత్రులు విస్తృత ప్రచారం నిర్వహించారు. మంత్రులు జనార్దన్‌రెడ్డి, ఫరూక్, రాంప్రసాద్‌రెడ్డి విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, తమ అభివృద్ధిని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తాయని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శాప్ చైర్మన్ రవినాయుడు, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, బీజేపీ నాయకులు, జనసేన నాయకులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముద్దు కృష్ణారెడ్డిని గెలిపించండి : మంత్రి ఫరూఖ్

ఒంటిమిట్ట జడ్పీటీసీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూఖ్ తెలిపారు. ఆదివారం ఒంటిమిట్ట కోదండరామాలయం వీధిలో ఎమ్మెల్యేలు పత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, పార్టీ సీనియర్ నాయకుడు జీఎన్ నాయుడుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేనపార్టీ జిల్లా నాయకులు అతికారి కృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు బాలసుబ్రమణ్యం, వేమన సతీష్, ఎద్దుల సుబ్బరాయుడు, కడప తెలుగుదేశంపార్టీ నాయకులు అమీర్‌బాబు, బొబ్బిలి రాయుడు, డాక్టర్ జిలానిబాషా, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముద్దు కృష్ణారెడ్డి గెలుపు ఖాయం

ఒంటిమిట్ట టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి విజయం ఖాయమైందని రాష్ట్ర కల్లుగీత కార్మికుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగు రోజులుగా ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. వారి ఉత్సాహం చూస్తుంటే ఇప్పటికే మా అభ్యర్థి విజయం ఖాయం అయ్యిందన్నారు.

తెలుగుదేశంతోనే బలిజ కులస్థుల అభివృద్ధి

రాష్ట్రంలోని బలిజ కులస్థులు తెలుగుదేశం పార్టీలోనే అభివృద్ధి చెందుతున్నారని తిరుపతి మాజీ ఎమ్మెల్యే, ఏపీజీబీసీ చైర్మన్ మన్నూరు సుగుణమ్మ తెలిపారు. ఆదివారం మండల కేంద్రమైన ఒంటిమిట్టలో బలిజ కులస్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బలిజ కులస్థుల అభివృద్ధికి ఎంతో సహకారం అందిస్తున్నారన్నారు. బలిజ అంటే తెలుగుదేశం, తెలుగుదేశం అంటే బలిజగా ఉన్నారన్నారు. ఒంటిమిట్ట జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కోడూరు బాలసుబ్రమణ్యం, ఎద్దుల సుబ్బరాయుడు, బుల్లెట్ రమణ, జనసేనపార్టీ నాయకుడు శ్రీనివాసరాజు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

'మాతంగ మహాపీఠం ఏర్పాటుకు సహకరిస్తాం'



మాతానందగిరిస్వామి సన్నిధిలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మాతంగ మహాపీఠానికి బీజేపీ తరఫున తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్ తెలిపారు. ఆదివారం లక్కిరెడిపల్లెలోని మాతంగ మహాపీఠం పీఠాధిపతి మాతానందగిరి స్వాముల వారిని కలిశారు. ఆశ్రమంలో మారేడు మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో మాతంగ మహాపీఠం ఏర్పాటు గొప్ప విషయమన్నారు. మఠంలో వేద పాఠశాల, గోశాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కడప, అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేశ్, శ్రీనాథ్‌రెడ్డి, తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే నరసింహారెడ్డి, రాయచోటి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి శ్రీనివాసరాజు, బీజేపీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి కృష్ణ, డాక్టర్ ఎస్వీ సుబ్బారెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు కొండూరు వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్ తనిఖీ

రామాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్‌ను ఆదివారం విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ జిలకర రాము తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి ఎన్ని పుస్తకాలు వచ్చాయి. ఎన్ని పంపిణీ చేశారు. ఎన్ని పుస్తకాలు మిగిలాయన్న అంశాలను పరిశీలించారు. మిగులు పుస్తకాలను పక్క మండలాలకు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రామకృష్ణుడు, శ్రీనివాసులు, సుండుపల్లె ఎంఈవోలు శ్రీనివాసులు, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

నేడు రైల్వేకోడూరు మార్కెట్ చైర్మన్ ప్రమాణ స్వీకారం

రైల్వేకోడూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన మైసూరివారిపల్లెకు చెందిన పగడాల వరలక్ష్మి సోమవారం రైల్వేకోడూరు పట్టణంలోని రాజ్‌కన్వెన్షన్ హాలులో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర ప్రకటించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరౌతున్నట్లు తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. జనసేన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గంలోని కూటమి నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రాజ్యాంగ పరిరక్షణతోనే సామాజిక న్యాయం

రాయచోటిటౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సమరశీల పోరాటాల ద్వారానే రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం సాధ్యమని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శివారెడ్డి తెలిపారు. ఆదివారం యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాయచోటి పట్టణంలోని నేతాజీ సర్కిల్ వద్ద యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రారెడ్డి, రాయచోటి మండల అధ్యక్షులు హఫీజుల్లా, చిన్నమండెం మండల అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, రాయచోటి మండల సహాధ్యక్షుడు రెడ్డిబసయ్యయ, మండల కార్యదర్శి రఫీక్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



'ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి'

సిద్దవటం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం మైనార్టీల సంక్షేమం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు, మైనార్టీశాఖ మంత్రి ఫరూక్ అన్నారు. మండలంలోని మాధవరంలో ఆదివారం ఆయన మాట్లాడారు. పెద్దపల్లి పరిధిలోని 3.68 ఎకరాల శ్మశాన స్థలం చదును చేసి, సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానిక ముస్లింలు విన్నవించారని, ఈ విషయాన్ని ఆగస్టు 15న కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. షాదీఖానా భవన నిర్మాణానికి కృషి చేస్తామని వివరించారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే ముస్లింల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారని ఆరోపించారు. వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన మసీదుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కూటమి నేత అతికారి కృష్ణ ముస్లిం కమ్యూనిటీ సంక్షేమానికి చేస్తున్న కృషి ఎన్నటికి మరువలేనిదని, గత రెండు రోజులుగా ఆయన ముస్లిం మైనార్టీలకు సంబంధించిన పలు సమస్యలను తన దృష్టికి తెచ్చాడన్నారు. మాధవరం లో తాగునీటి సమస్య ఎద్దడి సమస్య పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత అమీర్‌బాబు, రాష్ట్ర పంచాయతిరాజ్ చాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, యువ నాయకులు శ్రీకాంత్, ఎన్నారై చంద్ర, రవికుమార్, గంగయ్య, బాబి, విజయ్, మునిస్వామి, ముస్లిం మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

మహాగణపతి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న నాయకులు

ఓబులవారిపల్లె, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మంగంపేటలోని ఆర్‌ఆర్-1 సెంటర్‌లో మహాగణపతి ఆలయానికి ప్రభుత్వవిప్,ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి భూమి పూజ నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు ఉపసర్పంచ్ కొలారి మధుసూదన్‌రెడ్డి లక్ష రూపాయలు, కల్లా చలపతి రూ.75 వేలు, కొటారు రమణ రూ.50 వేలు విరాళంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంగపేట చీఫ్ ప్రాజెక్టు ఆఫీసర్ గోపీనాథ్, అనుమలగుండం చంద్రమోహన్, సర్పంచ్ సుధాకర్, పోకూరు సుబ్రమణ్యం, పలువురు నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి):మండలంలోని అనంతపురం గ్రామంలో ఆదివారం గంగమ్మకు పూజలు నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా చీర, సారె సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్‌వో ఫలితాల్లో శ్రీచైతన్య ప్రభంజనం



బహుమతులు పొందిన విద్యార్థులతో శ్రీచైతన్య విద్యాసంస్థల సిబ్బంది

రాయచోటి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు ఐఎన్‌టీఎస్‌వో ఫలితాల్లో అనూహ్య ఫలితాలు సాధించి వివిధ విభాగాల్లో బహుమతులు సాధించారని కడప డివిజన్ ఏజీఎండీ రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య ఇంటర్నేషనల్ బోర్డింగ్ స్కూల్ కడప రోడ్డులోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం విజేతలకు ల్యాప్‌టాప్‌లు ట్యాబ్‌లు నగదు బహుమతులతో పాటు మెడల్స్ ప్రశంసా పత్రాలు అందజేశారు. అంతకుముందు ఆర్ఐ మహబూబ్‌బాషా, ప్రిన్సిపాల్స్‌తో కలసి జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ కళాభారతి, శివార్జున రెడ్డి, నరేంద్ర, బీవీ ప్రసన్నకుమారి, రాధిక, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



250 మందికి కంటి పరీక్షలు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నలంద హైస్కూల్‌లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో తిరుపతి అరవింద్ హాస్పిటల్ వారు ఆదివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 250 మందికి పరీక్షలు చేసి 28 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారిని తిరుపతికి తీసుకెళ్లి శస్త్రచికిత్స చేసి క్షేమంగా ఇంటికి చేరుస్తారని సంస్థ మండల అధ్యక్షుడు ఉమాపతిరెడ్డి, చైర్మన్ బాలసుబ్రమణ్యం తెలిపారు.

రాయచోటిటౌన్ : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ ఆధ్వర్యంలో తిరుపతి ఎస్వీ అరవింద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం పట్టణంలో మెయిన్ రాజు స్కూల్‌లో 180 మందికి పరీక్షలు నిర్వహించారు. 25 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు శ్యామ్ తెలిపారు. వారిని తిరుపతి అరవింద్ హాస్పిటల్‌కు తీసుకెళ్లి సోమవారం మధ్యాహ్నం శస్త్ర చికిత్స అనంతరం సురక్షితంగా రాయచోటికి చేరుస్తామన్నారు. ఈ సందర్భంగా క్లబ్ రీజనల్ చైర్మన్ షేక్. మహమ్మద్ మాట్లాడుతూ అంధత్వ నివారణ లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఏర్పడిందన్నారు. ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని క్లబ్ అధ్యక్షుడు పీ. శ్యామ్ అందించారని ఉపాధ్యక్షుడు వీ. హరీశ్చంద్ర తెలియజేశారు. చెన్నముక్కపల్లి లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 20 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. 45 మందికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు అందులో 20 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 30 మందికి పరీక్షలు నిర్వహించి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, చెన్నముక్కపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

30 మంది రక్తదానం

సుండుపల్లె, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్త మసీదు వీధిలో సమాజ సేవకుడు సయ్యద్ అహ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు నూరి పర్వీన్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరు రక్తదానం చేస్తే కొరత అనేది ఉండదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సలాం అబ్దుల్‌కలాం సంస్థ అధ్యక్షుడు మాస్ మస్తాన్, టీచర్ అబూబకర్, షరీఫ్, అంజద్‌బాషా, నరసింహ, సాంబ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్తుమారెమ్మ జాతర

నందలూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : అరవపల్లె ముత్తుమారెమ్మ జాతరలో ఆదివారం పోతురాజు మేళతాళాలతో కన్యక చెరువు వద్ద ఉన్న ఆలయం వరకు వెళ్లి అనంతపురమ్మను వెంట తీసుకురాగా జాతర ప్రారంభమైంది. మహిళలు అంబళి సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్ మొదలియార్, జాతర నిర్వాహకులు శ్రీరామ్ కిరణ్‌కుమార్, నాగరాజు, సేలం సుధాకర్, సేలం సురేష్, మురళి ప్రసాంత్, దినేష్‌రెడ్డి, వెంకటరమణ; చెంగల్ రాయుడు పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక కల్యాణం

పెనగలూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పి.కొత్తపల్లెలో తలమంచి గిరీశ్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గిరీష్‌రెడ్డి నిర్మించిన కల్యాణ మండపంలో శనివారం రాత్రి తలమంచి రమణారెడ్డి, చంద్రకళ ఆధ్వర్యంలో సిద్ధి బుద్ధి సమేత కార్యసిద్ధి వినాయక స్వామి కల్యాణం నిర్వహించారు. చెంచు సుబ్బనరసయ్యస్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం కల్యాణోత్సవాన్ని నిర్వహించింది

దేవపట్ల సొసైటీ అధ్యక్షుడిగా కోటేశ్వర్‌రెడ్డి



సంబేపల్లె, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): దేవపట్ల సహకార సొసైటీ అధ్యక్షుడిగా (పీఏసీఎస్) మల్లూరు కోటేశ్వర్‌రెడ్డి సభ్యులుగా గురిగింజకుంట కృష్ణమ నాయుడు, రాళ్లపల్లి వేణుగోపాల్ నాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఎంపికకు సహకరించిన రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితోపాటు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

'కేజీబీవీ ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తప్పించాలి'

రాయచోటి కలెక్టరేట్, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): వీరబల్లి కస్తూరిబా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను వెంటనే విధులనుంచి తప్పించాలని ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి శేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దళిత విద్యార్థినులను కొట్టడంతోపాటు, సోషల్ టీచర్ రామకృష్ణమ్మను వేధిస్తున్న ప్రిన్సిపాల్ సాయిదివ్యపై చర్యలు తీసుకోవాలని కోరారు. దరఖాస్తు కూడా చేయక పోయినా, మెరిట్ లిస్టులో పేరు లేకున్నా ఈమెకు ఎలా పోస్టింగ్ ఇచ్చారన్న అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి కూడా తీసుకెళ్తామని తెలియజేశారు.

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి రైల్వే గేటు వద్ద ఆదివారం గుర్తు తెలియని వృద్ధుడు రైలు కిందపడ్డి ఆత్మహత్య చేసుకున్నట్లు రేణిగుంట రైల్వే హెడ్ కానిస్టేబుల్ గౌరీశంకర్ తెలిపారు. మృతదేహంపై తెల్ల పంచ, తెల్లని ఫుల్‌హ్యాండ్స్ షర్టుఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని రైల్వే కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. వివరాలు తెలిస్తే 9885753379కు సమాచారం ఇవ్వాలని కోరారు.



'హజ్ యాత్రికుల సంతోషమే సీఎం ధ్యేయం'



మాట్లాడుతున్న రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హసన్‌బాషా

రాయచోటిటౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రికులు సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని హజ్ కమిటీ చైర్మన్ హసన్‌బాషా తెలిపారు. ఆదివారం ఆయన రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు డాక్టర్ లక్ష్మిప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషాతో కలిసి మీడియాతో మాటాడారు. వైసీపీ ప్రభుత్వంలో ముస్లింల సంక్షేమం జగన్‌మోహన్‌రెడ్డి ఏనాడు పట్టించుకోలేదన్నారు. డాక్టర్ లక్ష్మిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఒక్కటే ముస్లింల సంక్షేమానికి కృషి చేసిందన్నారు. అనంతరం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా మాట్లాడుతూ హజ్ యాత్ర సులభతరం చేసేందుకు అప్పట్లోనే గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేశారన్నారు. విజయవాడ, కడపలో హజ్‌హౌస్ నిర్మించింది కూడా టీడీపీ హయాంలోనే అని తెలిపారు

ఆటోను ఢీకొన్న లారీ..



విగ్రహానికి లారీకి మధ్యలో ఆటో

సంబేపల్లె, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మోటకట్ల శివాలయం వద్ద శనివారం రాత్రి పీలేరు వైపు నుంచి రాయచోటి వైపు వస్తున్న లారీ అదుపుతప్పి ఆలయం వద్ద ఆగి ఉన్న ఆటోను ఢీకొని ముందున్న 20 అడుగుల శ్రీ కృష్ణ విగ్రహం ఢీకొని ఆగిపోయింది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయింది. ఆటోలో ప్రయాణికులు లేక పోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన పవన్‌కుమార్

మైదుకూరు రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రక్షాబంధన్ సందర్భంగా ఫ్రెండ్ చెల్లెలితో రాఖీ కట్టించుకోవాలని వెళ్లాడు.. తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మైదుకూరు మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. యర్రగుంట్ల టౌన్‌లో నివసిస్తున్న దేరంగుల పవన్‌కుమార్ (23) వైరింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడని, శనివారం రక్షాబంధన్ అయినందున తన ఫ్రెండ్ నాగరాజు నాయక్ చెల్లెలితో రాఖీ కట్టించుకొనేందుకు స్నేహితులిద్దరూ బైక్‌పై బద్వేల్‌కు వెళ్లారన్నారు. అక్కడ ఆమెతో రాఖీ కట్టించుకొని తిరిగి వస్తుండగా మండలంలోని బనవాపురం సమీపంలో రాత్రి సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రగాయాలతో ఉన్న ఇరువురిని స్థానికులు 108 వాహనంలో మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే పవన్‌కుమార్ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని, నాగరాజు నాయక్‌ను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని, ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సుబ్బయ్య తెలిపారు.

ట్రాక్టరుకింద పడి యువకుడి మృతి


మృతి చెందిన సుదర్శన్ (ఫైల్‌ఫొటో)

కడప క్రైం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కడప నగరం బిల్డప్ సర్కిల్ వద్ద ప్రమాదవశాత్తు యువకుడు ట్రాక్టరుకింద పడి మృతి చెందినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఆ వివరాల మేరకు.. చెన్నూరు మండలం కొక్కిరాయపల్లె గ్రామానికి చెందిన దొరబోయిన సుదర్శన్ (21) ఐటీఐ చదువుకుంటున్నాడు. అన్న కడప కార్పొరేషన్‌కు సంబంధించి చెత్త సేకరించేందుకు ట్రాక్టరును బాడుగకు ఇచ్చాడు. అయితే ఆదివారం కావడంతో సుదర్శన్ కూడా ఖాళీగా ఉండలేక ట్రాక్టరుతో పాటు వచ్చాడని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వినాయక్‌నగర్ సమీపంలోకి రాగానే గేదె అడ్డురావడంతో ట్రాక్టర్‌కు సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో ట్రాక్టరులో ఉన్న సుదర్శన్ పట్టు తప్పి అదే ట్రాక్టరు కింద పడిపోవడంతో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి...

కమలాపురం రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోపులాపురం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున రైలుకింద పడి కామనూరు నాగరాజు (35) మృతి చెందినట్లు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. కమలాపురం మండలం సి.రాజుపాలెం గ్రామానికి చెందిన నాగరాజు పశువులు మేపుతూ జీవనం సాగించేవాడు. మూడు సంవత్సరాల క్రితం తన భార్య టీబీ జబ్బు వల్ల చనిపోయింది. శనివారం పశువులు మేతకు వెళ్లి కనిపించలేదని, పాచికలపాడు సమీపంలో ఉన్నట్లు తెలుసుకుని వాటిని తోలుకుని వచ్చేందుకు నాగరాజు వెళ్లాడన్నారు. అయితే ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ గోపులాపురం సమీపంలో రైలు పట్టాలపై శవంగా కనిపించాడని రోదించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె కలరు. చిన్నారుల తల్లిదండ్రులిద్దరూ చనిపోవడంతో అనాథలుగా మిగిలారని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

యువకుడికి గాయాలు

మైదుకూరు రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): చాపాడు మండలం సిద్దారెడ్డిపల్లెకు చెందిన యువకుడు జి.నాగభూషణం తన తల్లితో కలిసి మోటర్‌సైకిల్‌పై వస్తూ ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొనడంతో గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఆదివారం వ్యక్తిగత పని మీద మైదుకూరుకు వచ్చి తిరిగి సిద్దారెడ్డిపల్లెకు వెళ్తుండగా ప్రొద్దుటూరులోని పశువైద్యశాల వద్ద ఆగి ఉన్న ఇన్నోవా వాహనాన్ని ఢీకొట్టారు. గాయపడినవారిని స్థానికులు 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విషద్రావణం తాగి మహిళ ఆత్మహత్యా యత్నం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో కలత చెంది మహిళ విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం మదనపల్లె పట్టణంలో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం అనపగుట్టకు చెందిన సంధ్య(35) టైలర్‌గా, తన భర్త శ్రీనివాసులు ఎలక్ట్రీషన్‌గా పని చేస్తూ జీవనం సాగించేవారని, శనివారం రాత్రి ఇరువురు ఘర్షణ పడ్డారని తెలిపారు. దీంతో మనస్థాపం చెందిన సంధ్య ఆదివారం ఉదయం విషద్రావణం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

పోరుమామిళ్ల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల చిన్నారిపై జరిగిన అత్యాచారం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన కలసపాడు మండలంలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడిని ఆదివారం పోరుమామిళ్ల మండలం మార్కాపురం వద్ద అరెస్టు చేసి కోర్టుకు పంపుతున్నట్లు తెలిపారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి సంఘటనలు జరగడం అత్యంత బాధాకరమన్నారు. తల్లిదండ్రులు చిన్న పిల్లలకు సెల్‌ఫోన్లు దూరంగా ఉంచాలని, సెల్‌ఫోన్లలో వచ్చే అశ్లీల సన్నివేశాలకు చాలామంది ప్రభావితులై ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐలు కొండారెడ్డి, తిమోతి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ : ఆస్తి నష్టం

వల్లూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుల్లారెడ్డిపేటలో శనివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగింది. ఈ ప్రమాదంలో రూ.50వేల విలువ చేసే ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయినట్లు యజమాని నాగేంద్ర తెలిపారు. బాధితుడి వివరాల మేరకు.. శనివారం రాత్రి ఇంటి ఆవరణంలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో శబ్ధాలు రావడంతో ఇంటి తలుపులు తీశామని, విద్యుత్ షార్టుసర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న ఫ్రిజ్, ఫ్యాను తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయని వాపోయారు. అలాగే ఇంటి పైకప్పు, ఇళ్లంతా నెర్రలు బారాయని, మంట లు వ్యాపించడం వల్ల నలుపు ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


కాలిపోయిన ఫ్రిడ్జ్

బిల్లులు లేకుండా ఎరువులు అమ్మితే చర్యలు

ములకలచెరువు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బిల్లులు లేకుండా ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో స్రవంతి హెచ్చరించారు. మండంలోని వేపూరికోటలో ఆదివారం జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు తప్పనిసరిగా జీఎస్టీ బిల్లు ఇవ్వాలన్నారు. ప్రతి దుకాణం ముందు తప్పనిసరిగా స్టాక్‌బోర్డు ఇవ్వాలన్నారు. కాలం చెల్లిన మందులు, విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

14న పులివెందుల ప్రజలకు స్వాతంత్ర్యం

స్వేచ్ఛాయుత వాతావరణంలో పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక : బీటెక్ రవి



పులివెందుల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక ఫలితాలు ఈనెల 14వ తేదీ వెలువడతాయని, దీంతో ఇండిపెండెన్స్‌డేకు ఒకరోజు ముందే పులివెందుల ప్రజలకు స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) అన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. పులివెందుల నియోజకవర్గంలో ఏడు మండలాలకు గాను పులివెందుల మండలానికి సంబంధించి జడ్పీటీసీ ఉప ఎన్నిక జరుగుతోందన్నారు. ఇది చాలా చిన్న ఎన్నిక అని, గెలుపుపై తమ పార్టీ పూర్తిగా దృష్టి సారించిందన్నారు. ఇందుకోసం ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లామన్నారు. ప్రచారానికి వెళ్లిన సమయంలో పులివెందుల ప్రజలు ఈ ఎన్నికలు గౌరవాన్ని తెచ్చిపెట్టాయని అంటున్నారన్నారు. గతంలో ఆయా పంచాయతీల్లోని ఒకరిద్దరు నాయకులు వెళ్లి వైఎస్ కుటుంబం వద్ద మెప్పుపొందేవారని, కానీ ఈ ఎన్నికలు రావడంతో గతంలో మాదిరి కాకుండా ప్రతి ఒక్కరి అభిప్రాయాలను గుర్తిస్తామని చెబుతున్నారన్నారు. ముఖ్యంగా వైసీపీ సాక్షి విలేకరులను, వాహనాలను తిప్పుతున్నారని, రాష్ట్రంలో ఉన్న వాహనాలన్నీ పులివెందులలోని గ్రామగ్రామానికి తెచ్చారన్నారు. గ్రామాల్లో వారంతట వారే అలజడి సృష్టించి లేనిపోని విధ్వంసాలకు దిగుతారని అనుమానంగా ఉందని, ఈ నేపథ్యంలో పోలీసులు కూడా పూర్తిస్థాయిలో భద్రత ఏర్పాటు చేస్తున్నారని, పులివెందులలో జరగబోయే జడ్పీటీసీ ఉపఎన్నికలు పూర్తిగా స్వేచ్ఛాయుత వాతావరణంలో సాగుతాయని బీటెక్ రవి తెలిపారు.

పులివెందుల ఎవరి అడ్డా కాదు..: ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



పులివెందుల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పులివెందుల ఎవరి అడ్డా కాదని, ఎవరి కంచుకోట కాదని, ఇందిరాగాంధీ లాంటి మహా నాయకురాలినే ఓడించిన ఘనత ఈ ప్రజలకు ఉందన్నారు. అటువంటి ఓటర్లకు ఎవరిని గెలిపించాలో బాగా తెలుసునని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. పులివెందుల ప్రాంతంలో జరిగిన అనేక ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేశామని, అందులో భాగంగానే ఇప్పుడు జరగబోయే ఎన్నికల్లో కూడా టీడీపీ బరిలో దిగిందన్నారు. కానీ అప్పటికీ, ఇప్పటికీ చాలా వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. గతంలో దౌర్జన్యాలు, దుర్మార్గాలు, కక్షసాధింపులతో ఎన్నికలు జరిగేవని, కానీ ఈ ఎన్నికలు పూర్తిగా స్వేచ్ఛాయుత వాతావరణంలో సాగబోతున్నాయన్నారు. హత్యా రాజకీయాలను ఈ ప్రాంతంలో వైసీపీ పెంచి పోషించిందన్నారు. పులివెందుల వైఎస్ కుటుంబం అడ్డా అని అనుకోవాల్సిన అవసరం లేదన్నారు. పులివెందులలో జరుగుతున్న జడ్పీటీసీ ఉప ఎన్నికలు నాలుగు దశాబ్దాల తర్వాత స్వేచ్ఛాయుత వాతావరణంలో సాగుతున్నాయన్నారు.

ప్రశాంత ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ ప్రయత్నం : ఎమ్మెల్యే ఆది


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

పులివెందుల రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో 2021లో జడ్పీటీసీ ఎన్నికలు జరిగితే టీడీపీ, బీజేపీ నాయకులు నామినేషన్ వేయకుండా వైసీపీ దౌర్జన్యం చేసిందని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ధ్వజమెత్తారు. అయితే ప్రస్తుతం జడ్పీటీసీ ఎన్నికలకు 11 నామినేషన్లు వచ్చాయని, ఇదే క్రమంలోనే ఎన్నికలు కూడా జరగబోతున్నాయన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గట్టెక్కిస్తున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ సహకారంతో నిధులు తేవడంతో పాటు పరిశ్రమలు వచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఎన్నడూ లేని విధంగా పులివెందులలో ప్రశాంతంగా ఎన్నికలు జరుగుతున్నాయని, ఈ ప్రశాంతతను చూసి వైసీపీ ఓర్వలేక వారిపై వారే దాడులు చేసుకొని తమపై నిందలు మోపి ఇక్కడ ఏదో జరగబోతోందని ప్రశాంత ఎన్నికలను అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. సొంత చెల్లెళ్లను పట్టించుకోని జగన్ తనను గెలిపించిన పులివెందుల ప్రజలను ఏం పట్టించుకుంటాడని, ప్రజలు ప్రతి విషయాన్ని గుర్తుపెట్టుకుంటారని, గతంలో చేసిన అరాచకాల కారణంగానే ప్రజలు 151 నుంచి 11సీట్లలో కూర్చోబెట్టారన్నారు. ఇక్కడి సమస్యలను, చేయాల్సిన అభివృద్ధి పనులను వంద రోజుల్లోనే పూర్తిచేసేలా సత్వర చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. ప్రజల సహకారం ఉందని, పులివెందులలో తప్పకుండా జెండా పాతుతామన్నారు. కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం కోసం పోరాటం : సీపీఐ


ర్యాలీగా వస్తున్న సీపీఐ నాయకులు, కార్మికులు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలపై పోరాటానికి సీపీఐ నేతలు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మధ్యాహ్నం సీపీఐ జిల్లా మహాసభల సందర్భంగా కార్మికులు మిషన్ కాంపౌండ్ నుంచి ర్యాలీగా కదిరి రోడ్డులోని శ్రీకృష్ణ కల్యాణమండపం వద్దకు చేరుకున్నారు. కార్మికులందరూ ఐక్యతతో పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు పది కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నూతన పాలకవర్గం ప్రజలను ఆదుకోవాలని, నిర్వహణలో భాగంగా జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు. రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించలేక, వ్యవసాయ రుణాలను మాఫీ చేయలేక రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వ్యాపారవేత్తలు రూ.1456 వేల డాలర్లు విదేశ బ్యాంకుల్లో దాచేశారని, 2026 నాటికి దేశంలో పేదరికం నిర్మూలన, అందరికీ విద్య, వైద్యం, ఉద్యోగ కల్పన కల్పిస్తామని హామీలు ఇచ్చారని, కానీ నెరవేర్చలేదన్నారు. నిరుద్యోగంతో యువకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేసి అదాని, అంబానీ చేతుల్లో పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని మార్చే విధంగా రాజ్యాంగం కాలరాయడానికి మనుధర్మశాస్త్రం అమలు చేయడానికి ప్రభుత్వాలు చూస్తున్నాని, ఇందుకోసం 400 సీట్లు తెచ్చుకోవానికి ఆరాటం పడుతోందన్నారు. ఏపీలో పరిశ్రమల ఊసేలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నరసింహులు, కార్యదర్శులు మురళీ, కృష్ణప్ప, సాంబశివ, మహేశ్, దేవా, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ముట్టడి

- బాలిక కిడ్నాప్ కేసులో న్యాయం చేయలేదని బాధితుల ఆవేదన

రామసముద్రం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడిని పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం చేశారని ఆరోపిస్తూ బాధిత కుటుంబాల సభ్యులు ఆదివారం పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. ఓ మైనర్ బాలికను బి.కొత్తకోట కు చెందిన యువకుడు గత ఎనిమిదో తేదీ రాత్రి ఇంటి తాళం పగులగొట్టి బాలికను కిడ్నాప్ చేసి బలవంతంగా పెళ్లి చేసుకున్నాడని, అంతేకాకుండా ఇంటిలోని బీరువాలో ఉన్న బంగారు నగలు ఎత్తుకెళ్లాడని బాధితులు అంటున్నారు. ఈ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని, అయితే నిందితుడిని పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం చూపడంతో తామే నిందితుడిని అచూకీ కనుక్కొని ఆదివారం బాలికతో పాటు నిందితుడిని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఇంటి నుండి ఎత్తుకెళ్లిన బంగారు నగలు, డబ్బు నిందితుడి నుండి రాబట్టి అతనిపై కేసు నమోదు చేయాలని బాధితులు కోరుతున్నారు. ఈ మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోప్ స్కిప్పింగ్ జిల్లా జట్టు ఎంపిక

మదనపల్లె టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన రోప్ స్కిప్పింగ్ క్రీడాకారుల నైపుణ్యం పరీక్షించి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు కరుణాకర్, లత, శరత్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి, ఈనెల 30వ తేదీన కర్నూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. అక్కడ గెలుపొందిన జిల్లా జట్టు మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి రోప్‌స్కిప్పింగ్ పోటీలకు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో జ్ఞానాంబిక కళాశాల కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, క్రీడాకారులు పాల్గొన్నారు.



జిల్లా జట్టుకు ఎంపికైన రోప్ స్కిప్పింగ్ క్రీడాకారులు

బంగారు నగల దుకాణంలో చోరీ

- రూ.15లక్షలు విలువ చేసే బంగారు, వెండి నగలు అపహరణ
- నగల బ్యాగుతో ఇద్దరు దొంగలు పరారీ

బద్వేలుటౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బద్వేలు మున్సిపాలిటీలో వరుస చోరీలతో పట్టణ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఆదమరచి ఉన్నామంటే చాలు చుట్టుపక్కల ఎందరు ఉన్నా.. ఎన్ని సీసీ కెమెరాలు వారి వైపే చూస్తున్నా.. దొంగల్లో అసలు బెరుకు అనేదే లేకుండా స్కెచ్‌వేసి, రిక్కీచేసి కొట్టాల్సిన టార్గెట్‌ను కనురెప్పపాటులో కొట్టుకుపోతున్నారు. దీనికి నిదర్శనం బద్వేలులో శనివారం రాత్రి జరిగిన బంగారు దుకాణంలో చోరీ ఘటనే నిదర్శనంగా నిలుస్తోంది. ఆ వివరాల్లోకి వెళితే... పట్టణంలోని సిద్దవటం రోడ్ మసీద్ కాంప్లెక్స్‌లో ఉన్న జేబీ బంగారు దుకాణాన్ని మూతవేస్తూ శనివారం రాత్రి దుకాణంలోని నగలన్నింటినీ ఒక బ్యాగులో పెట్టుకొని ఇంటికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండగా దుకాణ యజమాని ఒక పని నిమిత్తం బయటకు వెళ్లాడు. గమనించిన దొంగ ఆ దుకాణంలోకి దూరి నగల బ్యాగును పట్టుకొని ఉడాయించాడు. పక్కనే ఉన్న దుకాణదారుడు ఆ షాపుయజమానికి ఫోన్ చేయగా వచ్చి చూసేలోపే అంతా జరిగిపోయింది. అందులో 74గ్రాముల బంగారు నగలు, 7 కేజీల వెండి సామగ్రి ఉన్నాయని షాపు యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఆ దొంగకోసం నిఘాపెట్టిన ప్రయోజనం లేకుండా పోయింది. ఆదివారం ఉదయం క్లూస్‌టీం వచ్చి పరిశీలించారు. త్వరలోనే దొంగను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

రాణిస్తున్న మహిళా సబ్‌కలెక్టర్లు


సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్న చల్లా కల్యాణి

మదనపల్లె టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): దేశంలో అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా పేరొందిన మదనపల్లెలో సబ్‌కలెక్టర్లుగా మహిళలు రాణిస్తున్నారు. ఎనిమిదేళ్లలో ఎక్కువగా మహిళా సబ్‌కలెక్టర్లే పాలన సాగించారంటే అతిశయోక్తి కాదు. మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన మహిళల్లో కృతికబ్రత, వెట్రిసెల్వి, మేడిద జాహ్నవి, కీర్తి చేకూరి వున్నారు. వీరి తరువాత వైసీపీ పాలనలో మూడేళ్లుగా ఆర్డీవో మురళి, హరిప్రసాద్ పనిచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మేఘస్వరూప్ సబ్‌కలెక్టర్‌గా ఏడాది పనిచేశారు. తాజాగా చల్లా కల్యాణి సబ్‌కలెక్టర్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

అభివృద్ధికి ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధం : మంత్రి


పులివెందుల మండలం నల్లగొండవారిపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి

పులివెందుల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగే అభివృద్ధి, సంక్షేమానికి ఓటు వేసేందుకు పులివెందుల ప్రజలు సిద్ధంగా ఉన్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత అన్నారు. ఆదివారం మండలంలోని రాయలాపురం గ్రామంలో ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలు అందించి పింఛన్లు, తల్లికివందనం పథకాలు అందాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోడ్లు బాగుచేయించాలని ప్రజలు అడుగగా ఈ గ్రామానికి రూ.40లక్షలు మంజూరైందని, ఆ నిధులతో రోడ్లు పూర్తిచేయిస్తామని మంత్రి తెలిపారు. జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని, కూటమి ప్రభుత్వ పాలన పట్ల సంతోషంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం ఉన్నప్పుడు, లేనప్పుడూ వైసీపీ దౌర్జన్యాలు ఆగడం లేదని ప్రజలే అంటున్నారన్నారు.

గ్రామాల్లో ప్రచార హోరు

పులివెందుల మండలంలోని ఇ.కొత్తపల్లె గ్రామంలో మంత్రి పార్థసారథి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నల్లగొండవారిపల్లెలో జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి, అలాగే అచ్చవెల్లి గ్రామంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

హవ్వా.. ఓటుకు రూ.10వేలా..!

- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కూటమి, వైసీపీ
- తులసిరెడ్డి ఆశ్చర్యం

వేంపల్లె, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని వైసీపీ, కూటమి పార్టీలు అపహాస్యం చేస్తున్నాయని, పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రెండు పార్టీలు ప్రయత్నించడం దురదృష్టకరమని, ఓటుకు రూ.10వేలు పలుకుతుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మొన్నటి వరకు వైసీపీ దౌర్జన్యాలకు దిగిందని, నామినేషన్ వేయకుండా అడ్డుకుందని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ వీరవిహారం చేశారన్నారు. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలో ధనస్వామ్యంగా జరుగుతోందన్నారు. 9 నెలల కాలంమాత్రమే ఉన్న ఎలాంటిఅధికారాలు లేని జడ్పీటీసీకి ఇంతలా దిగజారుతారా అంటూ ప్రశ్నించారు. ఎన్నికలు ఎందుకు.. వేలంపాట గాని, లాటరీపద్ధతిలో నిర్వహిస్తే సరిపోతుంది కదా అన్నారు. ఇటు ప్రతిపక్ష వైసీపీ, కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే ఎన్నికల కమిషన్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమని, ఈ పరిణామం ప్రజాస్వామ్యంలో సిగ్గుచేటని తులసిరెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు.

ఆలయ అభివృద్ధికి రూ.10 లక్షల విరాళం

వాల్మీకిపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): చింతపర్తిలోని చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి చౌడేపల్లె వాసి బోయకొండ ఆలయ మాజీ చైర్మన్ ఎస్కే రమణారెడ్డి రూ.10లక్షల చెక్కును ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి అందజేశారు. ఆదివారం నగిరిపల్లెలో టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆయనను కలిసి ఆలయ స్థితిగతులను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగేళ్ల కిందట చింతపర్తి మాజీ సర్పంచ్ కేశవరెడ్డికి ఇచ్చిన మాట మేరకు పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె వాసి బోయకొండ ఆలయ మాజీ చైర్మన్ ఎస్కే రమణారెడ్డి ఈ చెక్కును అందజేశారన్నారు. చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధి కోసం టీటీడీ నుంచి నిధులు వచ్చేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, సర్పంచ్ మహిత శేషాద్రిరెడ్డి, నేతలు కొండక్కగారి నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సత్యారెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి చెక్కును అందజేస్తున్న బోయకొండ ఆలయ మాజీ చైర్మన్ ఎస్కే రమణారెడ్డి

కురబలకు రాజకీయ అవకాశాలు కల్పించండి

బీజేపీ అధ్యక్షుడికి జబ్బల శ్రీనివాసులు వినతి



మాధవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న జబ్బల శ్రీనివాసులు

మదనపల్లె, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జనాభా ప్రతిపాదికన కురబలకు బీజేపీలో రాజకీయ అవకాశాలు కల్పించాలని కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను కోరారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన మాధవ్‌ను ఆదివారం రాయచోటిలో కలిసి సన్మానించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కురబలు 20లక్షల మంది జనాభా ఉన్నారని, వారిని గుర్తించి బీజేపీలో ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ప్రతి నియోజక వర్గంలోనూ కురబల ఆరాధ్యదైవం భక్త శ్రేష్ఠ కనకదాసు విగ్రహం, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సహకరించాలని కోరగా, మాధవ్, అందుకు సానుకూలంగా స్పందించారు. కురబసంఘం జిల్లా అధ్యక్షుడు రవిశంకర్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఈశ్వరయ్య, మురళి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలకు తరలిన నేతలు



మహాసభలకు బయలు దేరుతున్న సీపీఐ నేతలు

బి.కొత్తకోట, ఆగస్టు 10(ఆంధ్ర జ్యోతి): మదనపల్లి కేంద్రంగా మూడు రోజులు నిర్వహించనున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా మహాసభలకు బి.కొత్తకోట నుంచి పార్టీ కార్యకర్తలు, నేతలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. తాడిత పీడిత వర్గాలు, కార్మికుల హక్కుల కోసం సీపీఐ నిరంతర పోరాటాలు చేస్తూనే వుంటుందన్నారు. మహాసభలకు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజ యవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మమ్మల్నీ పట్టించుకోండి సామీ...?!

రిపేర్లకు నోచుకోని చేతి పంపులు ● నిరుపయోగంగా పరికరాలు ● 'బోరు' మంటున్న పంపులు



అరిగెలవారిపల్లెలో మరమ్మతులకు నోచుకోని చేతిపంపు

గుర్రంకొండ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): 'ఎందరికో నీటిని అందించి అన్ని అవసరాలను తీర్చి అలసిపోయి మూలన పడ్డాము. మేము మరమ్మతులకు గురైతే ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపాన పోలేదు. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో మేము వీకల్లోతు కూరుకుపోయాము. కొన్ని ప్రాంతాల్లో పేడ దిబ్బల్లో సైతం ఇరుక్కుపోయాము. మాగురించి పట్టించుకోండి' అంటూ చేతి పంపులు ఆవేదన చెందాయి. వివరాల్లోకెళితే...

గ్రామాలు, పట్టణంలో ప్రజల తాగునీటి కష్టాలను తీర్చడానికి ఏర్పాటు చేసిన చేతి పంపులు అలంకారప్రాయంగా మారాయి. వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదు. దీంతో భూగర్భ జలాలు రోజు రోజుకూ పాతాళానికి చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో పల్లె, పట్టణంలో వెయ్యి అడుగుల లోతున్న బోర్లే ఇంకిపోతున్నాయి. ఇలాంటి సమయంలో చేతి పంపుల పరిస్థితి దయనీయంగా మారింది. గ్రామాల్లో తాగునీటి అవసరాలను తీర్చడానికి ఏర్పాటు చేసిన చేతి పంపులు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో చేతి పంపులు దెబ్బతిని కింద పడిపోగా, మరికొన్ని పేడ దిబ్బలు, మట్టి దిబ్బల్లో కూరకుపోయాయి. అలాంటి చేతి పంపుల మరమ్మతుల కోసం లక్షలాది రూపాయలతో కొనుగోలు చేసిన పరికరాలు మూలనపడ్డాయి.

గుర్రంకొండ మండలంలో 15 పంచాయతుల్లో 259 చేతి పంపులున్నాయి. ఈ చేతి పంపుల్లో 88 పని చేస్తుండగా 73 నీరు రాక ఇంకిపోయాయి. మిగిలిన 98 చేతి పంపులు మరమ్మతులకు గురైనట్లు తెలుస్తోంది. మండలంలో మరమ్మతులకు గురైన చేతి పంపులు రిపేరు కోసం మండల పరిషత్ నిధుల నుంచి వివిధ రకాల పరికరాలను కొనుగోలు చేశారు. ఇందుకు రూ.3.79 లక్షల నిధులను ఖర్చు చేశారు. ఈ నిధులతో రెండు నెలల కిందట పరికరాలను కొనుగోలు చేసిన అధికారులు ఎంపీడీఓ కార్యాలయంలో మూలన పడేశారు. ఇలా ప్రభుత్వ నిధులను అనవసరంగా ఖర్చు చేసి చేతి పంపు పరికరాలను కొనుగోలు చేసి కమీషన్లకు అధికారులు ఆశపడ్డారని ప్రజా ప్రతినిధులు చర్చించుకుంటున్నారు. ఈ నిధులతో మండలంలో నీటి సమస్య నెలకొన్న గ్రామాల్లో బోర్లు వేసి ఉంటే తాగు నీటి సమస్య తీరేదని ప్రజలు మాట్లాడుకుంటున్నారు. చేతి పంపు పరికరాలను కొనుగోలు చేసిన అధికారులు పాడైన చేతి పంపులకు భాగాలను అమర్చి ఉంటే వర్షాలు కురిసిన సమయంలో ఉపయోగపడేవని ప్రజలు, మహిళలు అంటున్నారు.

పేడ, మట్టి దిబ్బలో కూరుకుపోయిన...

మండలంలోని పలుగ్రామాల్లో చేతి పంపులు మరమ్మతులకు గురై ఆలన పాలన నోచుకోలేదు. దీంతో చేతి పంపులు తమ రూపురేఖలు కోల్పోయాయి. టి.రాచపల్లెలో చేతి పంపునకు అమర్చిన ఇనుప కేసింగ్ పైప్ దెబ్బతిని నేలకొరిగింది. అరిగెలవారిపల్లెలో ఓ చేతిపంపు మట్టిలో కూరకుపోగా, మరో చేతిపంపు పేడ దిబ్బలో ఉంటూ మరమ్మతులకు నోచుకోలేదు. మండలంలోని పలు గ్రామాల్లో చేతిపంపులు దీనస్థితిలో ఉన్నాయి. ఈ చేతి పంపులను వినియోగం లోకి తీసుకొస్తే కాలం బాగా ఉన్న సమయంలో ప్రజలకు చేయూతగా ఉంటాయని ప్రజలు కోరు తున్నారు.





టి.రాచపల్లెలో నెలకొరిగిన చేతిపంపు, అరిగెలవారిపల్లెలో మట్టిలో కూరకుపోయిన...



ఎంపీడీఓ కార్యాలయంలో మూలనపడి ఉన్న చేతి పంపుల పరికరాలు

దెబ్బతిన్నపంపులను సరిచేస్తాం

మండలంలోని పలు గ్రామాల్లో చేతిపంపులు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న చేతి పంపులను గుర్తించి అవసరమైన భాగాలను అమర్చి వినియోగంలోకి తీసుకొస్తాం. అందుకు అవసరమైన పరికరాలను ఇప్పటికే కొనుగోలు చేశాం. ఈ పరికరాలను త్వరలోనే చేతి పంపులకు అమర్చి తాగునీటి సమస్యలకు పరిష్కారం చూపుతాం.

బ్రహ్మానందరెడ్డి, ఈఓఆర్డీ



పీలేరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా ఎడతెగని ఉక్కపోత, చెమట ధారలతో విసిగి వేసారిన పట్టణ ప్రజలకు ఉపశమనం కలిగేలా ఆదివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు లేకుండా ఆదివారం సాయం త్రం 5.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఎడతెరిపిలేకుండా వర్షం కురుసింది. దీం తో వర్షాకాలం ప్రారంభైన జూన్, జూలై మాసాల్లో మండలంలో అంతంత మాత్రంగానే వర్షాలు కురిశాయి. దీంతో ఈ సీజన్‌లో మంచి వాన ఉండదేమోనని ప్రజలు నిరాశ వ్యక్తం చేసేవారు. వారి అంచనాలు తలకిందులు చేస్తూ ఆదివారం సాయంత్రం పట్టణంలో మంచి వర్షం కురిసింది. వర్షానికి పీలేరు ఆర్టీసీ బస్టాండు సహా ఎల్‌బీఎస్ రోడ్డు, ఎస్వీ డీలక్స్ రోడ్డు, ముస్లిం శ్మశాన వాటిక, మదనపల్లె టర్నింగ్ ప్రాంతాల్లోని మురుగునీటి కాల్వలు పొంగి పొర్లాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ఇక ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం పూర్తి గా నీట మునిగింది. బస్టాండులో పార్కు చేసిన పలు ద్విచక్ర వాహనాలు, కార్లు పార్కింగ్‌లో నిలబెట్టిన పలు వాహనాలు పూర్తిగా నీట మునిగాయి.

అలుపెరగని పోరాటం యూటీఎఫ్ నైజం

యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సదాశివరెడ్డి



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న యూనియన్ నేతలు, ఉపాధ్యాయులు

పీలేరు రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో అలుపెరగని పోరాటం యూటీఎఫ్ నైజమని రాష్ట్ర కౌన్సిలర్ సదాశివరెడ్డి అన్నారు. ఆదివారం పీలేరులో యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని జెండాను సీనియర్ నేత రాధాక్రిష్ణ ఆవిష్కరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే అజెండాతో పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వవలసిన ఆర్థిక బకాయిలు పేరుకు పోయాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని కోరారు. పీఆర్‌సీ అరియర్స్ పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ చెందిన వారికి రావాల్సిన బెనిఫిట్స్ వెంటనే విడుదల చేయాలని తెలిపారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటి వరకూ పెండింగ్ బకాయిలు, పీఆర్‌సీ, ఐఆర్ ఊసెత్తక పోవడం తగదన్నారు. యూటీఎఫ్ నేతలు చెంగల్ రాయులు, చెంగారెడ్డి, సుధాకర్, ఈశ్వర మహేంద్ర, వేణుగోపాల్, నాయక్, విజయకుమార్, నారాయణ నాయుడు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరిస్తున్న మహాభారత యజ్ఞం



మహాభారత యజ్ఞం వివరిస్తున్న కథకురాలు

నిమ్మనపల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బాలినాయునిపల్లిలో గత నెల 27నుంచి ప్రారంభమైన ద్రౌపదీ సమేత ధర్మరాజుల మహాభారత యజ్ఞం దిగ్విజయంగా కొనసాగుతోంది. ఆదివారం పగలు విరాటపర్వం, రాత్రి కీచక వధ కధకురాలు కౌసల్య ఆలపించారు. ఒక్కో హరికథ, నాటకాన్ని ఒక్కో ఉభయదారులుగా మహాభారత యజ్ఞాన్ని పూర్తి చేస్తారు. మహాభారత యజ్ఞం ఈ నెల 14న జరిగే ధర్మరాజు పట్టాభిషేకంతో పూర్తి అవుతుందని తెలిపారు. కొన్నేళ్లుగా బాలినాయునిపల్లిలో మహాభారత యజ్ఞం నిర్విరామంగా జరుగుతోంది. మహాభారత యజ్ఞానికి మండల ప్రజలే కాక ఇతర ప్రాంతాల నుంచి వచ్చి తిలకిస్తుండడం విశేషం. గోవర్ధన్ తబలా, నారాయణప్ప హార్మోనియం వాయించారు

కారు ఢీ - యువకుడికి గాయాలు

పీలేరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని యువకునికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. చంద్రగిరికి చెందిన సుమంత్ ఆదివారం ఉదయం వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో పీలేరుకు వచ్చి తిరిగి వెళుతుండగా తిరుపతి రోడ్డులోని ఏపీ ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సుమంత్‌కు తీవ్ర గాయాలు కాగా పీలేరు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ లోకేశ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



'హిందువుల ఐక్యత చాటాం'



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

మదనపల్లె, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ నిర్వహించిన హైందవ శంఖారావ మహాసభతో హిందువుల ఐక్యత ప్రపంచానికి తెలిసిందని దక్షిణాంధ్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శారద దత్త పీఠం విద్యాభివన సుబ్రమణ్య భారతి మహాస్వామి, బండన్న పీఠం పగడాల లక్ష్మీపతి స్వామితో కలిసి నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ హిందువుల్లో మనకెందుకు అనే భావన ఉందని, దీంతో హిందూ సమాజ మనుగడ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇటీవల మదనపల్లె హనుమాన్ శోభయాత్ర బైక్ ర్యాలీపై జరిగిన దాడికి ప్రతిగా హిందువులు పెద్ద సంఖ్యలో సంఘటితమై మహా ర్యాలీ చేపట్టడం చర్చకు దారి తీసిందన్నారు.

ఒంటిమిట్ట ప్రచారంలో మదనపల్లె నేతలు



ఒంటిమిట్ట ప్రచారంలో మంత్రి మండిపల్లెతో టీడీపీ నేత మల్లికార్జుననాయుడు

మదనపల్లె, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల ప్రచారంలో మదనపల్లె నేతలు చురుగ్గా పాల్గొంటున్నారు. టీడీపీ అభ్యర్థి అద్దులూరి ముద్దుకృష్ణారెడ్డిని గెలిపించాలని తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త కోహూరి మల్లికార్జుననాయుడు, జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ జంగాల శివరామ్ మంత్రి మండిపల్లె రామ్‌ప్రసాద్ రెడ్డితో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం జరిగిన ప్రచారంలో జనసేన నేతలు లక్ష్మీపతి, జి.రెడ్డెప్ప, నాగవేణి, గ్రానైట్ బాబు, నవీన్, పద్దు పాల్గొన్నారు.

చెరువుముందరపల్లెలో తీరిన తాగునీటి కొరత



కలికిరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చెరువుముందర పల్లెలో ఎట్టకేలకు తాగునీటి సమస్య ఒక కొలిక్కి వచ్చింది. గ్రామస్థులు తాగునీటి సమస్యను పరి ష్క రించాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి దృష్టికి తెచ్చారు. పంచాయతీ నిధులతో కొత్త బోరు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించడంతో సర్పంచు ఎల్లయ్య, పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగే ష్ రెడ్డి, కార్యదర్శి అశోక్ చొరవ తీసుకుని తాగునీటి సరఫరా అధికారులతో సమన్వయం చేసుకుని ఆది వారం కొత్తగా బోరు తవ్వించారు. దాదాపు మూడు ఇంచ్‌ల నీరు వస్తున్నట్లు అధికారులు చెప్పారు. బోరు, కొత్తగా మోటారు, పైపులు తదితర పరికరాల కు మొత్తం రూ.3 లక్షలు పైబడి ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. వెంటనే మోటారు అమర్చి తాగునీరు అందజేస్తామని అధికారులు చెపుతున్నారు. దీంతో గ్రామస్థులు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేద విద్యార్థులకు ఏబీఎన్ ట్రస్టు ఆర్థిక సాయం



పేదవిద్యార్థికి చెక్కును అందజేస్తున్న విజయ భాస్కర్‌చౌదరి

మదనపల్లె టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ చదువుతున్న నలుగురు పేద విద్యార్థులకు ఏబీఎన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆరిక సహాయం అందజేశారు. ఆదివారం లయన్స్ హాస్పిటల్ వద్ద ఏబీఎన్ (అనూరాధ, భాస్కర్‌నాయుడు)ట్రస్టు వ్యవస్థాపకులు అనూరాధ, భాస్కర్ నాయుడు నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్టీలు మాట్లాడుతూ 40 ఏళ్లగా మదనపల్లె ప్రజలకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేవలందించిన తాము, ఇప్పుడు పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించేందుకు ట్రస్టు ఏర్పాటు చేశామన్నారు. నలుగురు ఇంజనీరింగ్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. పది మంది ఇంటర్ విద్యార్థులకు రూ.10వేలు చొప్పున సాయం అందిస్తున్నామన్నారు. మిట్స్ డీమ్డుటుబీ యూనివర్సిటీ చాన్సలర్ విజయ భాస్కర్‌చౌదరి నుంచి విద్యార్థులకు చెక్కులు అందజేశారు. లయన్స్ హాస్పిటల్ వారి సన్మానం పొందిన విజయభాస్కర్ చౌదరి మాట్లాడుతూ గంగారపు సుబ్బిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కృష్ణసాగర్ రెడ్డి మిట్స్ కళాశాలకు ఎంతో సహకరించారన్నారు. యూనివర్సిటీ హోదా కల్పించడంలో మంత్రి నారా లోకేశ్ సహకరించారన్నారు. మిట్స్ కూడా ఏబీఎన్ ట్రస్టు సాయం పొందిన వారికి 50శాతం రాయితీ ఇస్తామన్నారు.

డాక్టర్ పాల్ రవికుమార్‌కు సన్మానం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో డీసీహెచ్ఎస్‌గా సేవలను అందించి ఉద్యోగ విరమణ పొందిన ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ పాల్ రవికమార్‌ను వీసీకే పార్టీ బాస్ నేతలు సంయుక్తంగా ఆత్మీయ సన్మాన సభను ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. పీటీఎం శివప్రసాద్, విశ్రాంత ఎంఈఓ పోతబోలు రెడ్డెప్ప ఎస్బీఐ విశ్రాంత చీఫ్ మేనేజర్ మునివెంకటప్ప బాస్ నేతలు సన్మానించారు. చెవి-ముక్కు వైద్యనిపుణులుగా, వైద్యాధికారిగా 31 ఏళ్లు ప్రజలకు సేవలను అందించారన్నారు. సోముశేఖర్, రెడ్డెప్ప, అంజప్ప, గంగరాజు, కేశవన్న, శివన్న, గంగాధర్, జీవిరమణ, రవి, రమణ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచు ఆరోగాన్ని పంచు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డ్డాకర్ ముని గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. జీఆర్టీ హైస్కూల్‌లో సభ్యులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంచు- ఆరోగ్యాన్ని పంచు అంటూ ఇంటింటా చెట్లు ఊరంతా వనం నినాదంతో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యదర్శి కరుణాకర్, ట్రెజరర్ ఉస్మాన్ సాహెబ్, ఉపాధ్యక్షుడు జగన్మోహన్, ప్రొఫెసర్ శ్రీనివాసులు, డాక్టర్ గొల్లపుడి తిరుపతిరావు, యోగా టీచర్ కష్టప్ప, మానవతా సంస్థ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం... జనజీవనం అస్తవ్యస్తం

ములకలచెరువు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ములకలచెరువును వర్షం వీడడం లేదు. మూడు రోజులుగా రోజూ వర్షం కురుస్తూనే ఉంది. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. గంటకుపైగా భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ప్రధాన రహదారులు వర్షపు నీటితో ప్రవహించాయి. మురికినీటి కాల్వలు పొంగిపొర్లాయి. మార్కెట్ యార్డులో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టమోటాలపై పట్టలు కప్పాల్సి వచ్చింది.